

తెల్లాపూర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

# చెరువులకు ఎఫ్‌టీఎల్ ఫిక్స్ చేయాలి

**కలెక్టర్ వల్లూరు క్రాంతి**

రామచంద్రాపురం, అక్టోబర్ 7: చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ ఫిక్స్ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దుల ఏర్పాటు, ఇంటి పన్నులు, విలీన గ్రామాలు తదితర అంశాలపై చర్చించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఇంటి పన్నులు ఏవిధంగా వేస్తున్నారనే విషయాలను కమిషనర్ సంగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, విలీన గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యలు, ఇంజినీరింగ్ పనులపై ఆరా తీశారు. అభివృద్ధికి కావాల్సిన నిధులపై మున్సిపాల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, కమిషనర్ సంగారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తెల్లాపూర్‌లో ఏర్పాటు చేయాల్సిన వంద పడకల దవాఖాన కోసం ల్యాండ్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరడంతో సర్వేనంబర్ 323లో రెండెకరాలు దవాఖాన కోసం మంజూరు చేస్తామన్నారు. చెరువుల పరిరక్షణ కోసం ఎఫ్‌టీఎల్ హద్దులు ఇంతవరకు ఎందుకు ఫిక్స్ చేయలేదని ఇరిగేషన్ ఏఈ సంతోషిని ప్రశ్నించారు. వెంటనే చెరువులకు ఎఫ్‌టీఎల్ ఫిక్స్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో తడి,పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ప్రోటోకాల్ పాటించడం లేదని చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌లో భాగంగా తెల్లాపూర్‌లో శిల్పా వెంచర్‌ని సందర్శించి ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి పూర్తి చేయాలని తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డిని ఆదేశించారు. ఆ తర్వాత మున్సిపల్ కార్యాలయం పక్కనే నిర్మాణ దశలో ఉన్న ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీకి కలెక్టర్ మొదటిసారి రావడంతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనంలో కలియతిరుగుతూ కార్యాలయ నిర్మాణం బాగుందని కితాబిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# వివరాల నమోదును పూర్తి చేయాలి



మున్సిపల్ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

అందోల్, అక్టోబర్ 7: ప్రభుత్వ పథకాలన్నీ డిజిటల్ కార్డుల ద్వారానే అందుతాయని, ప్రభుత్వం త్వరలోనే ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులను అందజేస్తుందని, డిజిటల్ కార్డుల ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ తిరుపతితో మాట్లాడారు. సర్వే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సర్వేకు సహకరించి సిబ్బందికి పూర్తి వివరాలు అందజేయాలన్నారు. చెరువు భూములను ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుతో రాంసన్‌పల్లిలో చెరువు, భూములను పరిశీలించారు. సర్వే చేసి పూర్తి నివేదిక అందజేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సాగర్‌మధూకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు

జిన్నారం, అక్టోబర్ 7: ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి అక్రమంగా నిర్మించిన నాలుగు నిర్మాణాలను తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్ నారాయణ జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఖాజీపల్లి పరిధిలో కొంతమంది తరుచూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ తెలిపారు.

# సంబురంగా పూల పండుగ

- ఎస్పీ కార్యాలయంలో అంబరాన్నంటిన వేడుకలు
- వాడవాడలా బతుకమ్మ ఆటలు

అందోల్, అక్టోబర్ 7: నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు పెద్ద ఎత్తున్న పాల్గొన్ని ఆడి పాడారు. తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి సంతోషంగా సంబురాలు నిర్వహించుకొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమైన బతుకమ్మలను మహిళలు సహజసిద్ధమైన పూలతో తయారుచేసుకొని రాగా.. జోగిపేట పట్టణవీధులు పూలవనాలను తలపించాయి. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి.. అందంగా పేర్చిన పూల బతుకమ్మలను ఒకచోటుకు చేర్చి పాటలు పాడుతూ ఆటలాడారు. అనంతరం దగ్గర్లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనాలు చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు వేడుకలకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంచి నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రూపేశ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మహిళా పోలీసులు, సిబ్బంది బతుకమ్మ ఆడారు.



ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మలతో మహిళా సిబ్బంది



అందోల్: జోగిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మలతో ఎస్పీ రూపేశ్, మహిళా సిబ్బంది



ఝరాసంగం: ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



హత్నూర: బతుకమ్మలతో మహిళా సంఘాల సభ్యులు



కార్మికులకు పండుగ కానుకలను అందజేస్తున్న చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

# మున్సిపల్ సిబ్బందికి దసరా కానుకలు

రామచంద్రాపురం, అక్టోబర్ 7: తెల్లాపూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, వివిధ శాఖల సిబ్బందికి చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితాసోమిరెడ్డి ఆధ్వర్యంలో దసరా పండుగ కానుకలో భాగంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగలైన బతుకమ్మ, దసరాను మున్సిపల్ కార్మికులు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పండుగకు బట్టలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్ సంగారెడ్డి ఉన్నారు.

***విద్యుత్‌నగర్‌లో..***

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు కౌన్సిలర్ బాబ్జీ పండుగ బట్టలు అందజేశారు. కార్మికులు సంతోషంగా బతుకమ్మ, దసరా పండుగను జరుపుకోవాలని ఆకాక్షించారు. అన్వర్, చిన్ని ఉన్నారు.

# కార్మికులకు న్యాయం చేయాలి



కవేలి సెయింట్ గోబైన్ పరిశ్రమ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కోహీర్, అక్టోబర్ 7: కవేలి రాక్‌వూల్(సెయింట్ గోబైన్) పరిశ్రమ యాజమాన్యం వెంటనే న్యాయం చేయాలని సీఐటీయూ జహీరాబాద్ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పరిశ్రమ యాజమాన్యం వేతన ఒప్పదం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కార్మికుల కుటుంబాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే వేతన ఒప్పదం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరంతరంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో శివరామరావు, సంగమేశ్వర్, జైపాల్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, అబ్దుల్ లతీఫ్, దౌలప్ప, కార్మికులు ఉన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంజయ్య

రాయికోడ్, అక్టోబర్ 7: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా అంజయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించిది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అందోల్ నియోజకవర్గంలో రాయికోడ్ మండల పరిధిలోని నాగ్వర్ గ్రామానికి చెందిన అంజయ్య బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో రాయికోడ్ మండలంలో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీగా పదవులు చేపట్టారు. మంత్రి దామోదరరాజనర్సింహకు ముఖ్య అనుచరుడిగా ఆయనకు మంచి పేరు ఉన్నది. తనకు పదవి ఇవ్వడంపై మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలిపారు. పస్తుతం సంగారెడ్డిలో ప్రముఖ న్యాయవాదిగా స్వచ్ఛందంగా పలు కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, అక్టోబర్7: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగం గా శ్రీదేవి భూదేవి సమేత కల్యా ణ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు హనుమంత వాహన సేవలో దర్శనమిచ్చారు. భక్తు లు స్వామివారిని దర్శించుకొని సామూహికంగా కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్యక ధర్మకర్తలు కేవీ నర్సింహాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షు డు లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.



సామూహికంగా కుంకుమార్చనలలోభక్తులు

# 'సంగమేశ్వర' పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నారాయణఖేడ్, అక్టోబర్ 7: రైతులకు సాగు నీటి ఇబ్బంది ఉండకూడదని అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్ కోరారు. సోమవారం నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నదని మండిపడ్డారు. ఆగిపోయిన ప్రజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిరంజీవి, అశోక్, గణపతి పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పరిశీలన



మల్లన్న బస్తీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, తదితరులు

బొల్లారం, అక్టోబర్ 7: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు మల్లన్న బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రార్‌కు సూచించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్, నాయకులు శేషారెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

## రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

కోహీర్, అక్టోబర్ 7: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి ఆదేశించారు. సోమవారం మండలంలోని వెంకటాపూర్ రైతు వేదికలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

## ఫర్టిలైజర్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా శంకర్



మునిపల్లి, అక్టోంబర్ 7: మునిపల్లి మండల ఫర్టిలైజర్ డిలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా అంతరం గ్రామానికి చెందిన ఎడ్ల శంకర్‌ను మునిపల్లి మండల ఫర్టిలైజర్ల డీలర్లు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఫర్టిలైజర్ల సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఫర్టిలైజర్ డీలర్‌కు అండగా ఉంటానన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫర్టిలైజర్ల సంఘం సభ్యులు ఉన్నారు.

## పలువురికి జరిమానా

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 7: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి సిద్దిపేట న్యాయస్థానం సోమవారం జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఎంపీడీవో, నర్సాపురం చౌరస్తాతోపాటు రాజీవ్ రహదారిపై పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 24 మందిని పట్టుకున్నామన్నారు. ఈ మేరకు జడ్జి కాంతారావు ముందు హాజరు పరచగా ఆయన విచారణ జరిపి వాహనాదారులకు 44వేల 500 వందల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

## కంకుల మిషన్ రైతుపై పడి చెయ్యి కట్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 7: మొక్కజొన్న కంకులు పడుతుండగా మిషన్‌లో ప్రమాదవశాత్తు రైతు చెయ్యి పడి విరిగిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చాంద్ పాషా తన మొక్కజొన్న కంకులను సోమవారం పడుతున్నాడు. కుంకులు పడుతున్న క్రమంలో కంకుల సంచి మిషన్‌లో పడిపోయింది. దీంతో సంచిని తియ్యడానికి మిషన్‌లో చెయ్యి పెట్టడంతో చాంద్ పాషా చెయ్యి కట్ అయ్యింది. వెంటనే బాధిడుతుడిని 108 ద్వారా సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు.

## కాంగ్రెస్ రైతు వ్యతిరేకి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 7: వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతుభరోసా డబ్బులు రైతులకు ఎప్పుడు ఇస్తారని సోమవారం రైతుబంధు సమితి సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. 11 విడుతల్లో నిర్వీరామంగా రైతుబంధు అందించిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌దే అన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

బెజ్జంకి, అక్టోబర్ 7 : మండల కేంద్ర పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శౌర్య యూత్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా సంగెం రూపేశ్, గౌరవ అధ్యక్షుడిగా సంగెం సంపత్, ఉపాధ్యక్షుడిగా రొడ్డ లక్ష్మణ్, ఎడ్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సంగెం సంపత్, కోశాధికారిగా బోనగిరి రూపేశ్, సహాయ కార్యదర్శులుగా మాసం ఎల్లయ్య, మంద అశోక్, సభ్యులుగా సంగెం మధు, మలేశం, ఎల్లయ్య, రాజు, సంతోష్, పరశురాములు, అనిల్, నరేశ్, సతీశ్, కృష్ణను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

## బతుకమ్మ, దసరా వేడుకలకు ఆర్థికసాయం



పండుగ ఉత్సవాల నిర్వహణకు నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, అక్టోబర్ 7: మండలంలోని మాదారం గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల నిర్వహణకు మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో నిర్వహించే బతుకమ్మ, దసరా పండుగలో లైటింగ్, డీజే ఏర్పాట్లకు రూ.25 వేలు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గణేశ్, నరేందర్‌గౌడ్, రమేశ్ పంచాయతీ కార్యదర్శి నవీన్‌కు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం అందజేశారు. నర్సింగ్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంగంపేట ముదిరాజ్ గ్రామ కమిటీ ఎన్నిక

జిన్నారం, అక్టోబర్ 7: మంగంపేట ముదిరాజ్ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏగుల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా చింతల చెరువు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఆకుల ఆంజనేయులు, కోశాధికారిగా అబ్బుగారి రాములు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. మన్నె రఘు, మాచబోయిన శ్రీశైలం, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యం కావాలి

సదాశివపేట, అక్టోబర్ 7: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మద్దికుంట చౌరస్తా వద్ద గల ఓ ఫంక్షన్‌హాల్‌లో నూతన సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, అర్హులైన వారికి ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడారు.

# ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

*దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పల్లెలు, పట్టణాల్లో వెలిసిన మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సోమవారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కుంకుమార్చన, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. లలితా త్రిపుర సుందరీగా, మహా చండీ దేవిగా, శ్రీవారాహి అవతారంలో అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 7*



బొల్లారం: శ్రీవారాహి అవతారంలో భవాని అమ్మవారు



జహీరాబాద్: వాసవీ కల్యాణ మండపంలో..



రాయికోడ్: ముత్యాలవాడలో లలితాదేవిగా ముమ్మాదేవి అమ్మవారు



మునిపల్లి: ఖమ్మంపల్లిలో మహా చండీదేవి అవతరంలో అమ్మవారు




రామచంద్రాపురం: మల్లికార్జుననగర్‌లో అమ్మవారి సన్నిధిలో హోమం చేస్తున్న భక్తులు




బొల్లారం: దుర్గామాత మండపంలో కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి, తదితరులు



జిన్నారం: జంగంపేటలో లలితా త్రిపుర సుందరీదేవిగా



గుమ్మడిదల: వీరభద్రస్వామి ఆలయంలో..



జిన్నారం: లలితాత్రిపుర సుందరీదేవిగా..